
కథ

# సర్రొగేట్ మదర్

- సింగరాజు నాగలక్ష్మి



మధురానగరం !

చక్కటి రాజ మందిరం !

చల్లని యమునానదీ తీరం!

అదిగో అదే కారాగారం. శ్రీకృష్ణ జన్మస్థానం.

ఉలిక్కిపడి లేచాడు వసుదేవుడు. 'ఏమిటా కారణం ?' అనుకుంటూ పక్కకి తిరిగాడు. అటు తిరిగి పడుకుని ఉన్న ప్రియపత్ని దేవకీదేవి భుజాలు కంపిస్తున్నాయి. తనకి మెలకువ రావటానికి కారణం దేవకీదేవి ఏడుపని గ్రహించాడు అతను. బాధగా నిట్టూర్చాడు. ఏమని ఓదార్చగలడా అభాగినిని ? ఇంతమంది బిడ్డలను కన్నది. ఒక్కరైనా కళ్లనిండుగా మిగిలారా ? తనైతే 'ఇంతే ప్రాప్తం' అని సరిపెట్టుకుంటున్నాడు. కానీ నవమోసాలు మోసి, ప్రసవ వేదనపడి పిల్లల్ని కన్నతల్లి ఎలా మనసుని ఊరడించు కుంటుంది ? దుఃఖించక మరేం చేస్తుంది ? ఏం చేసినా, ఎలా చెప్పినా ఆ తల్లికి ఊరడింపు అన్నది కలిగేనా?

ఓదార్పు అంతా కంఠంలో నింపుకుని ఆర్ద్రంగా "దేవకీ" అన్నాడతను. ఉలిక్కిపడిందామె. "ఏం నిద్రపట్టటం లేదా ? ఏదీ ఇటు తిరుగు". తలను మరింతగా దిండు లోపలికి చొప్పించింది కానీ ఆమె ఇటు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు.

"ఛ ! ఏమిటి దేవకీ ! మరీ బేలవై పోతున్నావు ? ఇటు తిరుగు - మా తల్లివిగా" బతిమాలుతూ బలవంతంగా తనవైపు తిప్పుకున్నాడు వసుదేవుడు. ఎంతసేపటి నుంచీ ఏడుస్తున్నదో .... కళ్లూ, ముఖమూ ఏకమైనాయి. కట్టతెగిన తటాకంలా ఉన్నది ఆమె వదనం.

"దేవీ ! దేవకీ !" అనునయిస్తూ దగ్గరికి

తీసుకున్నాడు. ఆ ఓదార్పుకి దుఃఖం మరింత ఇనుమడించింది కానీ ఏమాత్రం తగ్గలేదు. వసుదేవుడికి కూడా మాట పెగలడం లేదు. మౌనంగా ఉండి పోయాడు. ఆమె జుట్టును వెనక్కు సవరించాడు. కళ్లూ, చెక్కిళ్లూ తుడుస్తుంటే వెల్లువలా వేదన పెల్లుబికింది దేవకికి. వెక్కి వెక్కి ఏడిచింది. ఆ ఉధృతపు పొంగు చల్లారేదాకా మౌనంగా ఉండిపోయాడు వసుదేవుడు.

"ఈరోజు కొత్తగా వచ్చిన కష్టం ఏమున్నది దేవకీ? కారాగార వాసానికీ, కన్నబిడ్డల హత్యలకీ నువ్వింకా అలవాటు పడలేదా చెప్పు" ?

అతి కష్టం మీద మాట పెగలింది దేవకికి.

"అన్నిటికీ అలవాటు పడ్డాను. అందుకే జీవచ్ఛవంలా ప్రాణాలు నిలుపుకునే ఉన్నాను."

"మరింకేమిటి దేవీ ! నేటి నీ దుఃఖానికి కారణం?"

"స్వామీ ! రేపల్లెలో ఎవరో యశోదయట ! ఆమె అనుంగు బిడ్డడి లీలలు మీరు వినలేదా ? కారాగృహంలో కూడా కథలు కథలుగా చెప్పుకుంటున్నారే!"

గతుక్కుమన్నాడు వసుదేవుడు. యశోద ముద్దుల పట్టి మరెవరో కాదు. దేవకీ నందనుడే కదా! దేవకికి ఆ విషయం తెలిసిపోయిందా ?

"అయితే ఏమిటి దేవీ ? అన్ని కథల్లాగే ఇదీను".

"కాదు స్వామీ ! ఆ పాపడు ఈ వయసులోనే మా అన్న చేస్తున్న దురాగతాలు ఖండిస్తున్నాడని విన్నాను. ఆరోజు యోగ మాయ చెప్పినది మరచిపోయారా స్వామీ! అన్నను చంపేవాడు ఎక్కడో పెరుగుతున్నాడని ... ?

"అయితే ... ?

"ఆ బాలుడు ... నా పుత్రుడేమోనని ... అనుమానంగా ఉంది". బేలగా ఉన్న దేవకి ముఖం చూస్తుంటే వసుదేవుడికి మనసంతా జాలితో నిండి పోయింది. అటూ, ఇటూ చూసి లోగొంతుతో "దేవకీ! నారాణీ ! ఆ పిల్లవాడు ... మన పుత్రుడే" అన్నాడు.

"ఆఁ !" విస్మయంతో కేక పెట్టింది దేవకి. "నిజమేనా స్వామీ ?" కాపలాదారులు లోపలికి తొంగి చూశారు. "ఏం జరిగింది చిన్నరాణిగారూ" ? అన్నారు ప్రేమగా. దేవకి మీద ఎంత జాలి ఉన్నా, ఎంత ప్రేమ ఉన్నా మాట మినహా మరేం చెయ్యలేని అశక్తులు. కంస మహారాజు ఆజ్ఞానువర్తినులు. "ఏంలేదు. ఏదో కల... కల ..." తడబడుతూ జవాబిచ్చింది దేవకి.

"యదార్థమేనా స్వామీ. నేను నమ్మలేకుండా ఉన్నాను".

దేవకికి అతి మెల్లగా విషయం అంతా వివరించాడు వసుదేవుడు. శ్రీకృష్ణ జననం, కారాగారపు ద్వారాలు వాటంత అవే తెరుచుకోవటం, పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న యమునానది రెండుగా చీలి దారి ఇవ్వడం, తాను బుట్టలో పెట్టి తీసుకువెళ్లి ఆ బాలుణ్ణి పురుటింట్లో యశోద ప్రక్కన చేర్చటం, అక్కడి నుంచీ పాపను తెచ్చి దేవకి సరసన ఉంచటం ఇవన్నీ భర్త చెప్తూ ఉంటే విస్మయంతో వింటూ మౌనంగా ఉండిపోయింది దేవకి.

ఏమిటంత మౌనం అనుకుంటూ వసుదేవుడు దేవకి ముఖంలోకి చూశాడు. దేవకి కళ్లు నీళ్లతో నిండి ఉన్నాయి. ముఖం మరింత మ్లానమైంది.

"ఎంత దౌర్భాగ్యురాలిని నేను ! అంతటి మహోన్నత శిశువుకు తల్లిని నేను. కానీ జగమంతా యశోదా పుత్రుడంటుంది ! నేను కన్నతల్లినయినా ... తల్లిని కానట్టు తల్లడిల్లి పోవలసిందేనా ? ఇంతేనా నా ప్రాప్తం ?" నివారించ ప్రయత్నిస్తున్నా దుఃఖం ఆగడం లేదు దేవకికి. ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు వసుదేవుడికి. కాసేపు గడిచాక "ఆ బాలకుడు మనకి విముక్తి కలిగించటానికయినా దూరంగా పెరగక తప్పదు దేవీ ! పెద్దవాడయి నీ అన్నను సంహరించి, మనని ప్రపంచంలోకి తీసుకువెళ్తాడు. ఆరోజున యావత్ప్రపంచమూ అతగాడికి నీవే తల్లివని గుర్తిస్తుంది. ఇంకొంతకాలం మనకీ నిరీక్షణ తప్పదు దేవీ ! మన తలవ్రాతని ఎవరు చెరపగలరు చెప్పు ?" తనలో ఆశాభావం నింపుకుంటూ దాన్ని తన భార్యలో కూడా నింపే ప్రయత్నం చేశాడు వసుదేవుడు. ఆశ అనేదే లేకపోతే జీవితమే ఉండదన్న సత్యం తెలుసు అతగాడికి.

ప్రస్తుతం భవిష్యత్తు మీద ఆశ నిలుపుకోవడం

తప్ప వేరే అవకాశం ఏదీ లేదని తెలుసు. కళ్లలో, హృదయంలో నిండుగా ఆశ నింపుకుని ఆశతీరే రోజుకోసం నిరీక్షణలో మిగిలిపోయారు ఆ దంపతులు.

❋ ❋ ❋

కథ చదువుతున్న దేవకి కళ్లు చెరువులయ్యాయి. ఎవరో కానీ ఈ రచయిత సరిగ్గా తన మనసులో వ్యధనే కాగితం మీదికి దించాడు. ఎంత స్పష్టంగా వర్ణించాడు తల్లి వేదనని !

ఆ దంపతులకి ఆశ మిగిలింది కానీ తమలాటి అభాగ్య దంపతులకి ? ఎంత చిత్రంగా పెట్టేరో పెద్దలు తమకీ పేర్లు - దేవకి వసుదేవ్ ! పెళ్లి జరుగుతూ ఉంటే అందరూ అనుకున్నారు ఎంత చిత్రంగా పేర్లు కలిశాయని! పేర్లేకాదు తమ బాధలూ, వ్యధలూ కూడా కలిశాయి.

మరచి పోదామని ఎంత ప్రయత్నిస్తున్నా మరపురాని వాస్తవం మరోసారి కళ్లముందుకు వచ్చింది.

నీరజ ! తన చిన్ననాటి నెచ్చెలి. ఒకే స్కూలు. ఒకే క్లాసు. ఒకే వీధిలో యిల్లు. కొన్ని నెలల తేడాతో ఇద్దరికీ వివాహాలు.

చిన్నతనం నుంచే పువ్వులనీ, పిల్లలనీ అమితంగా ప్రేమించే మనసుదానిది. అనుకూలుడైన భర్త అవసరానికి మించిన సంపద. అయితే దానికో లోటు. అన్నీ సరిగ్గా ఉంటే తనని మర్చిపోతారని భయం కాబోలు ఆ దేవుడికి. దానికి పిల్లల్ని కనే అదృష్టం లేదు. గర్భసంచి ఏ మాత్రం బరువునీ మోయలేదట. రెండుసార్లు గర్భస్రావం జరిగాక డాక్టర్లు ఈ విషయం తేల్చి చెప్పేశారు.

ఒకరోజు సుడిగాలిలా వచ్చి చుట్టేసింది. పెరిగిన సైన్సు విజ్ఞానం, పిల్లల్ని పొందటానికి అవిష్కరించిన కొత్త మార్గాలు అన్నీ ఏకరువు పెట్టింది. తన పిల్లలు ఆరాధన, అరవిందలని అక్కున చేర్చుకుంది. "దేవీ ! ఇలాంటి పిల్లలు నాకూ కావాలి. సహాయం చెయ్యవూ ?" అంది బేలగా. "ఏం చెయ్యమంటావే నీరూ ?" అంది తను కరిగి నీరౌతూ.

టెస్ట్ట్యూబ్ బేబీస్ గురించి తనకు తెలిసినదంతా చెప్పింది. రెండువేలమంది పైగానే ఉన్నారట. ప్రపంచంలో అలా ఉద్భవించిన పిల్లలు. "మనదేశంలో కూడా దాదాపు పదిహేనుమంది ఉన్నారట తెలుసా?" అంది అర్థం అయీ కానట్టు చూసింది తను.

"దేవీ ! నా గర్భంలో తయారయిన పిండాన్ని నీ గర్భంలో మోసి నాకో పిల్లని కనివ్వవూ ? ఇక్కడ సహజ శారీరక సంపర్కం లేదు. కేవలం డాక్టర్ల వైద్య పరికరాలలోనే ఉంది. నీ పవిత్రత చెడదు. నీలా నన్నూ తల్లిని చెయ్యవూ ప్లీజ్ !"

నీరజ, దాని భర్త తననీ తన భర్తనీ డాక్టర్ల దగ్గరకు తీసుకు వెళ్లడం అన్ని వివరాలూ నలుగురూ క్షుణ్ణంగా తెలుసుకున్న తర్వాత "సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ" అని గాఢంగా విశ్వసించే తన భర్త వసుదేవ్ తనని నీరజా వివేక్‌ల బిడ్డకి "సర్రొగేట్ మదర్" అవమని ప్రోత్సహించటం జరిగింది. ఫలితంగా ఉద్భవించింది అందాల "అపూర్వ" నీరజకోసం.

అన్ని పనులూ సక్రమంగా చేసే నీరజ ఈ విషయంలో కూడా చాలా జాగ్రత్తగానే వ్యవహరించింది. పాప పుట్టకముందే అగ్రిమెంట్ రాయించుకుంది తమ యిద్దరితో. "కేవలం స్నేహితురాలికోసమే బిడ్డను కంటున్నట్లు భవిష్యత్తులో ఎప్పుడూ ఆ బిడ్డమీద తమకి ఎటువంటి హక్కులూ ఉండవనీను".

"ఎందుకే ఇవన్నీ ?" అంటే "ఉండనిద్దూ ! నీకూ నాకూ కూడా మంచిది. ఇదికూడా డాక్టరుగారి సలహామీదే చేస్తున్నా" అంది.

నిజం చెప్పాలంటే తనూ, ఆయనా కూడా ఎప్పుడూ ఈ విషయం పట్టించుకోలేదు. పైగా నీరజా, వివేక్‌లకి సహాయం చెయ్యగలిగినందుకు ఎంతో సంతోషపడ్డారు కూడాను. తమకేం తక్కువయిందని రెండు కళ్లలా తమకీ ఉన్నారు ఆరాధన, అరవిందలు.

నమ్మకాలు, ఆశలు వమ్ముకావడం ఎంతసేపు? స్కూల్‌డే వేడుకల్లో తమ పిల్లలిద్దరూ దేవకన్యలు. స్వర్గలోకపు సన్నివేశాన్ని స్కూలువాళ్లు తమ స్టేజ్ మీదికి దించే ప్రయత్నం చేశారు. ఆ సన్నివేశంలో నటించే పిల్లలంతా దేవకన్యల వేషాలే. చక్కగా బుట్టబొమ్మల్లా కనపడటానికి బోలెడన్ని కుచ్చులు పెట్టి స్కూలువాళ్లే అందరికీ గౌన్లు కుట్టించారు. రంగు రంగుల పాలిస్టర్

గుడ్డతో. దేవకన్యల వేషాలు వేసిన పిల్లలంతా క్షణాల్లో దేవలోకం చేరిపోయారు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది. వందపైగా పసిప్రాణాలు బూడిదైనాయి. ఆ షామియానా కూడా పాలిస్టర్‌ది కావడం వల్ల అగ్ని మరింత వేగంగా ప్రజ్వరిల్లింది. అలా కాలి బూడిదైన వందమంది పిల్లల్లో తమ ఆరాధన, అరవిందలు ... ఈ అమ్మ కడుపులో చిచ్చుపెడుతూ అదృశ్యమై పోయారు. పిచ్చెక్కినట్టు విలపిస్తుంటే నీరజ ప్రక్కనే ఉంది ఓదారుస్తూ.

రోజులు గడుస్తున్నా శూన్యం పెరిగిందే తప్ప తరగలేదు తమ మనసుల్లో. ప్రాణాలున్న కంకాళాల్లా తిరుగుతున్నారు తను వసుదేవూను.

"నీరూ ! ఒక్కసారి ... అపూర్వను తీసుకురావూ?" అంటే "దానికీ విషయాలేవీ తెలియటం నాకిష్టం లేదు దేవకీ !" అనేసింది నిర్మొహమాటంగా.

"నా కడుపులో ఊపిరి పోసుకుని, నా గర్భం చీల్చుకుంటూ పుట్టిన అపూర్వమీద నాకు హక్కెందుకు ఉండదండీ ?" అంటూ భర్త దగ్గర వాపోతే. "మనం అన్నీ ఒప్పుకునే చేశాం కదా దేవీ ! అగ్రిమెంటు కూడా రాసిచ్చాం. అపూర్వ మనకి ఏమీ కాదు. ఆ విషయం నువ్వు మర్చిపోవడం తప్ప చేయగలిగింది ఏమీ లేదు" అనేశాడు ఆవేదనగా.

మరేం లేదని తనకీ తెలుసు. కానీ ... కానీ ...

* * *

ఆలోచనకి అంతరాయం కలిగిస్తూ బెల్లు మ్రోగింది. కళ్లు తుడుచుకుంటూ లేచి వెళ్లి తలుపుతీసింది దేవకి. ఎదురుగా భర్త వసుదేవ్.

ఎన్నాళ్లనుంచో నవ్వు మరచిపోయిన అతని వదనంలో చిన్న దరహాస రేఖ.

"శుభవార్త దేవకీ ! నువ్వు ప్లే-స్కూల్ పెట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరత్వరగా ఇల్లు సర్దుకోవాలి అందుకనువుగా" ప్రయత్న పూర్వకంగా నవ్వాడు వసుదేవ్. బాధనణిచే ప్రయత్నం సుస్పష్టంగా గోచరిస్తూనే ఉంది.

"అయితే ఇంకేం. ఇకనుంచీ మన యింటినిండా పిల్లలే పిల్లలు" హర్షం వెలిబుచ్చింది దేవకి.

అంతకు మించి మాట్లాడుకోవటానికి ఇద్దరికీ ధైర్యం చాలలేదు. జాలిగా కాస్సేపు, ఓదార్పుగా కాసేపు ఒకరి నొకరు చూసుకుంటూ కూర్చుండిపోయారు దేవకీ, వసుదేవ్‌లు.

తన కడుపున పుట్టిన పిల్లవాణ్ణే పెంచుతున్నా ననుకుంటూ కన్నయ్యని యశోద పెంచితే తన పిల్లనే కొద్దిరోజులు పరాయి కడుపులో ఉంచి తెచ్చుకున్నాను అనుకుంటూ అపూర్వని నీరజ పెంచుకుంటోంది.

**ఈనాటి సృష్టి ఈ సర్రొగేట్ మదర్ షిప్ !?** ✪

**(D.A.V. School, School Day వేడుకల్లో ఈ Synthetic Dress, షామియానాల వల్ల ఎందరో పిల్లలు బూడిదైనారు. అలా పిల్లల్ని పోగొట్టుకున్న ఒక తల్లిదండ్రుల ఆవేదనకిది రూపం !)**

**(రంజని నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)**

✤ ✤ ✤ ✤ ✤